
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 11 జూన్ 2025

మత్కేపల్లిలో వ్యవసాయ మార్కెట్



- మంత్రి తుమ్మల చొరవతో ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- చింతకాని, ముదిగొండ మండలాల రైతులకు ఉపయుక్తం

ఖమ్మం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పలు పంటల సాగు, ఉత్పత్తుల్లో ప్రత్యేకతను కలిగిన ఉన్న జిల్లాల్లో ఒకటిగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు కాబోతోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మధిర నియోజకవర్గంలోని చింతకాని, ముదిగొండ మండలాలను కలుపుకొని చింతకాని మండలం మత్కేపల్లిలో వ్యవసాయమార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. చింతకాని మండల రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధి, ముదిగొండ మండల రైతులు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్నారు. ఇకపై ఆ రెండు మండలాల రైతుల సంక్షేమం, సౌలభ్యం కోసం మత్కేపల్లి వ్యవసాయమార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో 15కు పెరిగిన మార్కెట్ల సంఖ్య

ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 14వ్యవసాయ మార్కెట్లు ఉండగా.. మత్కేపల్లిలో కొత్త మార్కెట్ మంజూరుతో ఆసంఖ్య 15కు పెరగింది. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, నేలకొండపల్లి, మద్దులపల్లి, వైరా, ఏన్కూరు, కల్లూరు, మధిర, సత్తుపల్లి ఉండగా, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో కొత్తగూడెం(లక్ష్మీదేవిపల్లి), బూర్గంపాడు, (మిగతా 6వ పేజీలో)

నేడు రామయ్యకు జ్యేష్ఠాభిషేకం

సంప్రదాయబద్ధంగా అంకురార్పణ



గోదావరి నుంచి తీర్థబిందెను తీసుకొచ్చిన అర్చకులు

భద్రాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచల రామాలయంలో బుధవారం జ్యేష్ఠాభిషేకం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ వేడుకకు మంగళవారం సంప్రదాయబద్ధంగా అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా గోదావరి నుంచి తీర్థబిందెతో నీటిని తీసుకొచ్చి యాగశాల వద్ద ఉత్సవ అంకురార్పణ గావించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు జ్యేష్ఠాభిషేక అంకురారోపణంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇదే సమయంలో జ్యేష్ఠాభిషేకంలో పాల్గొనే వైదిక సిబ్బందికి దీక్షా వస్త్రాలను అందజేశారు. బుధవారం జ్యేష్ఠాభిషేకంలో భాగంగా హవనం, పూర్ణాహుతి, 81 కలశాలతో స్వామి వారికి అభిషేకం, ఉత్సవ సమాప్తి నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా జ్యేష్ఠాభిషేకాన్ని పురస్కరించుకొని బుధవారం నిత్యకల్యాణాన్ని నిలిపేశారు.

భక్త జన రామయ్య ! 7

మూడేళ్లుగా మే నెలలో పెరుగుతున్న రద్దీ | ఏటికేడు అధికమవుతున్న ఆదాయం

రాజకీయ చైతన్యం కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓవైపు కాంగ్రెస్ పార్టీలోనూ.. మరోవైపు ప్రభుత్వంలోనూ కీలకంగా వ్యవహరిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తొమ్మిది నియోజవర్గాలు.. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు లోక్‌సభ స్థానాలను హస్తగతం చేసుకోగా.. ఆ కాంగ్రెస్ అనుకూల పవనాలు చుట్టుపక్కల జిల్లాల్లోనూ ప్రభావం చూపాయని విశ్లేషకులు పలు సందర్భాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉమ్మడి జిల్లా నేతల పాత్ర కీలకం కావడంతో నాడు మంత్రివర్గంలో, ఆ తర్వాత పలు కార్పొరేషన్లకు చైర్మన్లు, ఇప్పుడు పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నేతలకు అధిష్ఠానం అధిక ప్రాధాన్యమిచ్చింది.



పీసీసీ పదవుల్లోనూ పైచేయి..

- కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం
- ప్రధాన కార్యదర్శులుగా ఎనిమిది మంది నియామకం
- సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యం

ఖమ్మం, జూన్ 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర మంత్రి వర్గంలో ఉపముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డికి స్థానం కల్పించింది. అలాగే లోక్‌సభ ఎన్నికల ముందు జరిగిన రాజ్యసభ స్థానాల భర్తీలోనూ జిల్లా నుంచి కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరికి రాజ్యసభ స్థానం అవకాశం దక్కింది. ఇక ప్రభుత్వం మొదటి విడత పలు కార్పొరేషన్ పదవులను భర్తీ చేయడంలో భాగంగా గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు, నీటిపారుదల సంస్థ చైర్మన్‌గా మువ్వా విజయ్ బాబు, హస్తకళాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పొదెం వీరయ్యకు అవకాశమిచ్చింది. ఇలా ఒకే జిల్లానుంచి నలుగురు చైర్మన్లు కావడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాశంగా మారింది. ఇదిలా ఉంటే ఇటీవల ప్రకటించిన పీసీసీ సలహా కమిటీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరికి అవకాశం దక్కింది. ఇలా ఒకే జిల్లానుంచి ముగ్గురికి సలహామండలిలో స్థానం దక్కడం కూడా అరుదైన అంశంగా పేర్కొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలోనూ సముచిత స్థానం

తాజాగా ఏఐసీసీ టీపీసీసీ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శులను ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 69మందికి అవకాశమివ్వగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎనిమిది మంది నేతలకు పీసీసీ ప్రధాన కార్యదర్శులుగా చోటు దక్కింది. ఇది కూడా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. అయితే ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గీయులకు ఈ పదవులు దక్కాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా ఎవరి పేర్లు సూచించలేదు. పార్టీలో మొదటి నుంచి ఉన్న సీనియర్లకు పదవులివ్వాలని, ఆ తర్వాతే కొత్తవారికి అవకాశమివ్వాలంటూ (మిగతా 6వ పేజీలో)

నియామక పదవులపై ఆశలు

రాష్ట్రంలో మిగిలిన కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల భర్తీ, పీసీసీ ఇతర కార్యవర్గ పదవులకు నేతల ఎంపికపై సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో ఉమ్మడిజిల్లాలో పలు దేవాలయ కమిటీలకు చైర్మన్లు, రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులు, ప్రభుత్వ సంస్థల డైరెక్టర్ పదవులకు త్వరలోనే నియామకాలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఆశావహులు మంత్రులు, తమ నియోజకవర్గ ఎమ్మెల్యేల ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ నియామక పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నియామకాల్లో కూడా జిల్లాకు సముచిత స్థానం దక్కే అవకాశం కనిపిస్తోంది.

విద్యుత్‌శాఖపై బకాయిల భారం

- భద్రాద్రి జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన బిల్లులు
- హెచ్‌టీ రూ.404కోట్లు, ఎల్టీ రూ.62కోట్లు పెండింగ్
- నిధుల కొరతను ఎదుర్కొంటున్న విద్యుత్‌శాఖ



కొత్తగూడెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్‌శాఖలో మొండిబకాయిలు మరింతగా పెరిగిపోతున్నాయి. బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడం వల్ల అవి పేరుకుపోయి తలకు మించిన బరువుగా మారుతున్నాయి. వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బిల్లులు కూడా చెల్లించకపోవడంతో విద్యుత్‌శాఖపై మరింత ఆర్థిక భారం పడుతోంది. దీంతో ఈ భారం నుంచి గట్టెక్కెందుకు విద్యుత్‌శాఖ బ్యాంకు రుణాల వైపు చూస్తోంది. విద్యుత్ బకాయిలు కలిగినవాటిలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా జిల్లాలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ శాఖల కార్యాలయాలు కూడా ఉన్నాయి.

గత ఏప్రిల్ వరకు హెచ్‌టీ (హైటెన్షన్) కనెక్షన్‌కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.404కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇదేకాకుండా ఎల్టీ(లోటెన్షన్) కనెక్షన్లకు సంబంధించి జిల్లాలో సుమారు రూ.62కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. అయితే అత్యధికంగా జిల్లాకు సంబంధించి మిషన్ భగీరథ శాఖ నుంచి 25 సర్వీసులకు గాను రూ.310.72కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. మునిసిపల్ (మిగతా 6వ పేజీలో)

ఘనంగా అమ్మమాట.. అంగన్‌వాడీ బడిబాట

శ్రీకారం చుట్టిన అధికారులు | ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడులో పాల్గొన్న డీడబ్ల్యూవో

ఖమ్మం ఖానాపురంహవేలీ/ ఖమ్మం రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం పునఃప్రారంభించారు. ఖమ్మం జిల్లాలోని ఏడు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1,840, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మొత్తం 11 ప్రాజెక్టుల పరిధిలోని 2,061 అంగన్వాడీ కేంద్రాల్లో అధికారులు ఇనుప గంట, ఇతర లోహంతో చేసిన గంటలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ ఆదేశాలు, చేపట్టిన కార్యాచరణ మేరకు పిల్లలకు ఆహారంగా ఎగ్ బిర్యానీ, పలావ్ అందించారు. చిన్నారుల తల్లితండ్రులతో సెల్ఫీ దిగారు. ఉదయం ప్రీ స్కూల్ పిల్లల తల్లితండ్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రీ స్కూల్ పాఠశాల కమిటీ సభ్యులను ఆహ్వానించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రపరిచి, మామిడి తోరణాలు కట్టి అలంకరించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని ముస్తాఫానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు. నీరజ, ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, ఖమ్మం నగరంలోని గొల్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఖమ్మం అర్బన్ సీడీపీవో వీరభద్రమ్మ పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీవోలు బడిబాట కార్యక్రమాలను నిర్వహించారు.

రుచి, శుచి ముఖ్యం : డీడబ్ల్యూవో


అంగన్‌వాడీ కేంద్రల్లో పిల్లలు ఇష్టంగా తినేందుకు మెనూలో స్వల్ప మార్పులతో రుచికరంగా తయారు చేయవచ్చని, ఈ కేంద్రాల్లో రుచి, శుచి ఎంతో ముఖ్యమని (మిగతా 6వ పేజీలో)



ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పాల్గొన్న డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి

కొబ్బరి బోర్డు కల తీరేనా?

- రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 75శాతం కొబ్బరి సాగు
- భద్రాద్రి జిల్లాలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు అవకాశం
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విన్నవించిన మంత్రి తుమ్మల
- అభివృద్ధి బోర్డు ఏర్పడితే మరింతగా తోటల విస్తరణ



కొత్తగూడెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాకు సరిహద్దున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పామాయిల్‌తో పాటు కొబ్బరి సాగు కూడా అత్యధికంగా చేపడుతుండడంతో ఈ జిల్లాలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి విన్నవించిన నేపథ్యంలో ఈ అంశంపై ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 3,300 ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 75శాతం తోటలు విస్తరించి ఉన్నాయి. ఖమ్మం జిల్లా సరిహద్దులో ఉన్న వరంగల్, ములుగు జిల్లాల్లోనూ కొబ్బరితోటలు విస్తారంగా సాగవుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రాద్రి జిల్లాలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా కొబ్బరి అభివృద్ధిబోర్డు కార్యాలయం ఉండేది. అయితే రాష్ట్ర విభజన తరువాత (మిగతా 6వ పేజీలో)

వెల్‌నెస్.. హోప్‌లెస్!

- ఏడేళ్ల క్రితం ఖమ్మం జిల్లా ఆస్పత్రి అనుబంధంగా సెంటర్ ఏర్పాటు
- నెలరోజులుగా మందులు లేక ఉద్యోగులు, పెన్షనర్ల అవస్థలు

6



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

1.09 లక్షల విలువైన మిరప విత్తనాలు స్వాధీనం

7

- ఇద్దరిపై కేసు, రిమాండ్‌కు తరలింపు
- కారు, రెండు సెల్‌ఫోన్లు సీజ్

సమాజ భాగస్వామ్యంతోనే మత్తు మాఫియా నిర్మూలన

- యువతను డ్రగ్స్ వైపు ప్రోత్సహిస్తున్న పాలకులు
- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్
- ఖమ్మంలో ముగిసిన యువ చైతన్య సైకిల్ యాత్ర



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సమాజ భాగస్వామ్యంతోనే మత్తు మాఫియా నిర్మూలన జరుగుతుందని డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేక పాలకులు వారిని మత్తు పదార్థాల వైపు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మత్తుపదార్థాల నిర్మూలన డిమాండ్‌తో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన యువచైతన్య సైకిల్‌యాత్ర మంగళవారం ముగిసింది. ఖమ్మంలో జరిగిన ముగింపు సభకు ముఖ్య వక్తలుగా కోట రమేశ్, నున్నా నాగేశ్వరరావు, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, త్రీటౌన్ సీఐ కొండల్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మద్యం, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటుపడకుండా అవగాహన పెంచేందుకు సామాజిక బాధ్యతతో డీవైఎఫ్ఐ సైకిల్‌యాత్ర చేపట్టిందన్నారు. యువత ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉపాధి, నిరుద్యోగ భృతి, ఉచిత విద్యపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొంతు రాంబాబు, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, ఏఎం జబ్బార్, ముద్దా ప్రభాకర్, చింతల రమేశ్, బహీరుద్దీన్, సత్తెనపల్లి నరేశ్, గుమ్మ ముత్తారావు, బొడ్డు మధు, కూరపాటి శ్రీను పాల్గొన్నారు.

'విద్యుత్ అంబులెన్స్'లు



- సరఫరా తక్షణ పునరుద్ధరణకు ఎమర్జెన్సీ రీ స్టోర్ బృందాలు
- 24గంటలు అందుబాటులో సేవలు
- తొలి విడతలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 4 వాహనాలు
- టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 33 వాహనాల కొనుగోలు
- నేడు ఖమ్మంలో ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

7

30 ఏళ్లపాటు ఉండేలా నిర్మాణాలు చేపట్టాలి

మిషన్ భగీరథ పనులపై జల్ జీవన్‌జల శక్తి శాఖ సమీక్ష

భద్రాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ జలశక్తి మిషన్ ద్వారా మారుమూల గ్రామాల్లో చేపట్టే మంచినీటి వసతి, పారిశుధ్య కార్యక్రమాల పనులు కనీసం 30ఏళ్లపాటు చెక్కు చెదరకుండా ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని మినిస్టరీ ఆఫ్ జలశక్తి న్యూఢిల్లీ అడిషనల్ సెక్రటరీ కమల్ కిషోర్ ఆదేశించారు. మంగళవారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల్లోని కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో మంచినీటి సరఫరా సక్రమంగా జరగాలని, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకొని ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీల వారీగా మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్యలు సంబంధించి సమావేశాలు ఏర్పాటు చేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పీవో మిషన్ భగీరథకు సంబంధించి కొత్త కనెక్షన్లు సర్వే నిర్వహిస్తున్నామని జిల్లాలో ఎనిమిది పీవీటీజీ హ్యాబిటేషన్లలో 365 కుటుంబాలకు కనెక్షన్లు ఇచ్చామని రూ.25 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంకు నిర్మించడానికి ప్రణాళిక చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మిషన్‌భగీరథ గ్రిడ్ ఈఈ నళిని, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ తిరుమలేష్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలి : పీవో

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన నూతన మెనూ ప్రకారం భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో హాస్టళ్లకు సరఫరా చేసే కూరగాయలు, పండ్లు, చికెన్, కోడిగుడ్లు, మాంసం సరఫరా చేసేందుకు కమిటీ సభ్యులు, సరుకులు సరఫరా ఏజెన్సీదారుల సమక్షంలో టెండరు బాక్సులను తెరిచి టెండర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్దేశించి నాణ్యత రేట్ల ప్రకారం సరుకులు, కూరగాయలు, పండ్లు సరఫరా చేయాలని, లోపాలు తలెత్తితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. నాసిరకమైన సరుకులు సరఫరా చేస్తే మూడేళ్ల పాటు గిరిజన సంక్షేమ శాఖలో ఎక్కడ టెండర్లు వేయకుండా బ్లాక్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ హరీష్, ఏసీఎంవో రమేష్, ఏటీడీవో అశోక్‌కుమార్, రాధమ్మ, హెచ్‌ఎంలు నరసింహారావు, సావిత్రి పాల్గొన్నారు.

వెల్‌నెస్.. హోప్‌లెస్!

- ఏడేళ్ల క్రితం ఖమ్మం జిల్లా ఆస్పత్రి అనుబంధంగా సెంటర్ ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 35వేల మంది సేవలు పొందే అవకాశం
- నెలరోజులుగా మందులు లేక ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల అవస్థలు
- బయటి షాపుల్లో కొనుక్కోవాల్సిన దుస్థితి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని పెన్షనర్లు, ఉద్యోగులు, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఖమ్మం జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌లో సేవలు హోప్‌లెస్‌గా మారాయి. నెలరోజులుగా మందులు లేని పరిస్థితి. కనీసం జ్వరం, తలనొప్పి లాంటి సాధారణ సమస్యలకు కూడా మందులు లేకపోవడంతో రోగులు వెనుతిరుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, పాత్రికేయులు, పెన్షనర్ల కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడేళ్ల క్రితం వెల్‌నెస్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఆరోగ్య పథకం ద్వారా వైద్యసేవలందించేందుకు ఈ సెంటర్ ను అందుబాటులోకి తీసుకువచ్చారు. కానీ నెలరోజులుగా మందులు లేకపోవడంతో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. సెంటర్‌లో మెరుగైన వైద్యం అందుతుందనే నమ్మకంతో వ్యయప్రయాసలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వస్తున్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కార్పొరేట్ వైద్య సేవలంటూ ప్రచారం!

ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 14వేల మంది పెన్షనర్లు, 19వేల మంది ఉద్యోగులు, 1600 మంది జర్నలిస్టులు ఉన్నారు. ఈ క్రమంలో వారి కోసం ఏర్పాటు చేసిన పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నట్టు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నా కనీసం బీపీ, షుగర్ తలనొప్పి లాంటి నొప్పుల ట్యాబ్లెట్లకు కూడా దిక్కులేని పరిస్థితి. నెలరోజులుగా ఫార్మసీ సిబ్బంది కూడా ఖాళీగా ఉంటున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, ఎంబీబీస్, బీడీఎస్, ఫిజియోథెరపిస్టు ఒకొక్కరు చొప్పున, నర్సింగ్ సిబ్బంది, ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇద్దరు ఫార్మాసిస్టులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ సేవలు అందిస్తున్నారు. రోజు కనీసం 150నుంచి 200మంది వరకు ఓపీ వస్తోంది. ఈ కేంద్రంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 938రకాల వైద్యసేవలు, ఆయుష్మాన్ భారత్ ద్వారా 1,676 రకాల సేవలందిస్తుండగా, ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు కేటాయించిన పథకంలో 1,875 రకాల వైద్య సేవలు అందుతున్నాయి. అయితే ఇక్కడ విధులు నిర్వహించే వైద్యులు కూడా సకాలంలో రావడం లేదని, వచ్చినా కనీసం గంట సేపు కూడా అందుబాటులో ఉండడం లేదని ఆరోపిస్తున్నారు.



నిరీక్షిస్తున్న రోగులు, రిటైర్డ్ ఉద్యోగులు

నెలరోజులుగా లేని మందులు

ఈ వెల్‌నెస్ సెంటర్‌కు నెల రోజులుగా మందుల రాక నిలిచిపోయింది. ఇక్కడికి వచ్చే వారిలో ఎక్కువగా బీపీ, షుగర్‌తో పాటు, ఇతరత్రా బాధలతో వచ్చేవారే ఎక్కువ. అయితే ఇప్పటివరకు నొప్పులు ట్యాబ్లెట్లు నిల్వ ఉన్నంత వరకు రోగులకు అందించారు. నెలరోజులుగా ఎలాంటి మందులు రాకపోవడంతో రోగులు బయట కొనుక్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెల్‌నెస్ సెంటర్‌కు మందులను సరఫరా చేయాలని కోరుతున్నారు.

వెల్‌నెస్ సెంటర్‌కు మందులు పంపిణీ చేయాలి

ఆర్‌ఎంవోకు ఉపాధ్యాయ సంఘాల నేతల వినతి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని వెల్‌నెస్ సెంటర్‌కు ప్రభుత్వం తక్షణమే మందులను సరఫరా చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధు, కందుల వెంకట నరసయ్య కోరారు. మంగళవారం వారు ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి ఆర్‌ఎంవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, పింఛన్‌దారులకు గత మూడు నెలలుగా మందులు సరఫరా కావట్లేదని తెలిపారు. జ్వరం, రక్తపోటు చక్కెర వ్యాధులకు మందులు లభించక ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అన్ని రకాల మందులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఆస్పత్రి వెల్‌నెస్ సెంటర్ డాక్టర్లు నారాయణమూర్తి, లక్ష్మీదీపలతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, సాధు లక్ష్మణరావు, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆర్‌ఎంవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

21 లోగా క్లినికల్ శిక్షణకు దరఖాస్తులు అందించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ, ఒకేషనల్ కోర్సులో మార్చి 2020 నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏడాది క్లినికల్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె.రవిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ప్రభుత్వ ఆస్పత్రి ఖమ్మంలో అందిస్తున్నట్టు తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు రూ.1000ల డీడీ రూపంలో చెల్లించాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోని ఎంపిక కాని వారు తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను జతచేసి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యలయంలో జూన్ 21లోగా అందించాలని తెలిపారు.

రేపు దిశ సర్వసభ్య సమావేశం

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గురువారం మధ్యాహ్నం 3గంటలకు ఐడీఓసీ కార్యాలయంలో దిశకమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశ కమిటీ చైర్మన్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి కో చైర్మన్ మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, జిల్లాకు చెందిన శాసనమండలి, ఎమ్మెల్యేలు, దిశకమిటీ సభ్యులు, అధికారులు పాల్గొననున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

రామయ్య భూముల్లో ప్రహరీ నిర్మాణానికి ఆటంకం

భద్రాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిదేవస్థానానికి చెందిన ఏపీలోని యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న రామయ్య భూముల్లో ప్రహరీ నిర్మాణానికి దేవస్థానం సిద్ధమైన తరుణంలో ఆటంకం ఎదురైంది. ఇటీవల భద్రాద్రి దేవస్థానం అధికారులు ప్రహరీ నిర్మాణానికి రూ.70 లక్షలు అంచనాలను తయారు చేసి దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆమోదానికి పంపారు. అవి ఆమోదానికి నోచుకోవడంతో ఇందుకు సంబంధించిన పనులను చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే స్థలం దేవస్థానందే అయినప్పటికీ ప్రహరీ నిర్మాణం చేపట్టడం వల్ల రాజుపేట కాలనీవైపు వారికి రాకపోకలకు ఇబ్బందులు వస్తాయని పేర్కొంటూ స్థానికులు వామపక్ష నాయకుల సహకారంతో అడ్డుకున్నట్టు సమాచారం. దీంతో ప్రహరీ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ పనులను చేపట్టడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆ సమయంలో అధికారులు వారికి నచ్చజెప్పినా వారు ప్రహరీ నిర్మాణం చేపట్టవద్దని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.

గ్రీన్ చాంపియన్ అవార్డు గ్రహీతను అభినందించిన డీఈవో



ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి గ్రీన్ చాంపియన్ అవార్డు అందుకున్న జడ్పీహెచ్‌ఎస్ వేంసూర్ పాఠశాల ఉపాధ్యాయుడు రాంబాబును మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ అభినందించారు. పాఠశాలల విభాగంలో 3 పురస్కారాలు ఉండగా, రాంబాబు ఖమ్మం జిల్లా నుంచి మొదటి పురస్కారం అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో సీఎంవో రాజశేఖర్, అర్బన్ మండల ఎంఈవో శైలజ లక్ష్మీ, సైన్స్ అధికారి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంఈ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కడుపు మండిన కార్మికులు హైదరాబాద్‌లో వైద్య విద్యాసంచాలకుల కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు.అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాలుగు రోజులుగా విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు.ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహించే పేషెంట్‌కేర్స్, పారిశుధ్య కార్మికులు హైదరాబాద్‌లో ఆందోళన చేశారు. ఏప్రిల్ నుంచి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా 259మంది కార్మికులు పేషెంట్‌కేర్, పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్నారు. గత రెండేళ్లుగా కార్మికులకు వేతనాలు చెల్లింపుల్లో తీవ్రంగా కోత విధించడంతో పాటు మూడు నాలుగు నెలలకోమారు జీతాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే జిల్లా ఆస్పత్రిలో వైద్య విధాన పరిషత్ కింద ఉన్నప్పుడు 575 పడకలకు సరిపడిన కార్మికులుగా 259మందికి వేతనాలు ఇచ్చారని ప్రస్తుతం డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో రాష్ట్ర వ్యాప్తంగా 2వ విడతలో మంజూరైన వైద్యకళాశాలల వరుసలో ఖమ్మం ఉందని, దీనికి కేవలం 435 పడకల సామర్థ్యానికే నిధులు వస్తుండడంతో వేతనాల్లో కొరత పడుతుందని తెలిసింది. గత నాలుగు రోజులుగా వేతనాల కోసం కడుపు మండిన కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కుమార్, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్వేష్ మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులను మూడు నెలల నుంచి పస్తులు ఉంచడం తీవ్రమైన నేరమన్నారు. వెంటనే జిల్లా మంత్రులు జోక్యం చేసుకొని కార్మికుల సమస్యల పరిష్కరించుకుంటే దీర్ఘకాలికంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఎంఈ నరేంద్ర కుమార్ ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని అందజేశారు.వారం లోగా ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపుతామని డీఎంఈ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్,టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి రామయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్, విజయమ్మ, అంబేద్కర్, వెంకటరమణ, జగదీష్, రాములమ్మ, అశోక్, హరీష్, మమత, రాధమ్మ పాల్గొన్నారు



డీఎంఈకి వినతిపత్రాన్ని అందిస్తున్న నేతలు

పీసీసీ పదవుల్లోనూ పైచేయి...

(5వ పేజీ తరువాయి)

మంత్రి తుమ్మల మొదట్లోనే పేర్కొన్నారు. దానికి తగ్గట్టుగానే తుమ్మల కార్యవర్గ పదవులకు ఎవరి పేరూ సిఫారసు చేయలేదు. అదే సమయంలో పీసీసీ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ పదవులకు మొదటినుంచి కాంగ్రెస్ కోసం పనిచేస్తున్న వారిని గుర్తించాలని అధిష్ఠానానికి సూచించినట్టు సమాచారం. కాగా ప్రస్తుతం జిల్లా నుంచి ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన వారిలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరాకు చెందిన నూతి సత్యనారాయణ, కట్ల రంగారావు, కొత్తగూడేనికి చెందిన నాగ సీతారాములు, మోతుకుపల్లి ధర్మారావు, చర్లకు చెందిన నల్లపు దుర్గాప్రసాద్, పాలేరు నియోజకవర్గానికి చెందిన మద్దినేని బేబి స్వర్ణకుమారి, ఖమ్మానికి చెందిన షాబీఅలీ ఉన్నారు.

సమీకరణాలు ఇలా..

ప్రధాన కార్యదర్శుల్లో నియమితులైన వారిలో మట్టా రాగమయి సత్తుపల్లి ఎమ్మెల్యేగా ఉండడం, సామాజిక సమీకరణాలతో పాటు మహిళా కోటా ఆమెకు కలిసి వచ్చింది. అలాగే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సుచేసిన వారిలో వైరాకు చెందిన నూతి సత్యనారాయణ, కొత్తగూడెం నుంచి నాగసీతారాములు, మోతుకుపల్లి ధర్మారావు, భద్రాచలం నియోజకవర్గం చర్లకు చెందిన నల్లపు దుర్గాప్రసాద్‌కు పదవులు దక్కాయి. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి సిఫార్సుతో పాలేరు నియోజకవర్గం నుంచిమద్దినేని బేబిస్వర్ణకుమారికి అవకాశం దక్కింది. ఆమె గతంలో టీడీపీ హయాంలో మహిళ ఆర్థిక సహకారం సంస్థ చైర్మన్‌గా వ్యవహరించారు. ఈసారి కూడాచైర్మన్ పదవి ఆశించారు. కానీ ఆమెకు అధిష్ఠానం పీసీసీ కమిటీలో స్థానం కల్పించింది. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి సిఫార్సుతో వైరాకు చెందిన కాంగ్రెస్‌నేత కట్ల రంగారావు అవకాశం లభించింది. అలాగే ఖమ్మానికి చెందిన కాంగ్రెస్ నేత జహీర్‌అలీ బంధువైన షాబీర్‌అలీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. షాబీర్‌అలీ.. హైదరాబాద్‌లోని ప్రదేశ్‌కాంగ్రెస్ కార్యాలయం (గాంధీభవన్)లో పార్టీ నిర్వాహణ కార్యక్రమాలు చూసుకుంటారు. ఆయన పీసీసీకి సుదీర్ఘకాలంగా చేస్తున్న సేవలను గుర్తించింది.

నియామక పదవులపై ఆశలు

రాష్ట్రంలో మిగిలిన కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల భర్తీ, పీసీసీ ఇతర కార్యవర్గ పదవులకు నేతల ఎంపికపై సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో ఉమ్మడిజిల్లాలో పలు దేవాలయ కమిటీలకు చైర్మన్లు, రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులు, ప్రభుత్వ సంస్థల డైరెక్టర్ పదవులకు త్వరలోనే నియామకాలు జరిగే అవకాశాలు కనిపిస్తతన్నాయి. దీంతో ఆశావహులు మంత్రులు, తమ నియోజకవర్గ ఎమ్మెల్యేల ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ నియామక పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నియామకాల్లో కూడా జిల్లాకు సముచిత స్థానం దక్కే అవకాశం కనిపిస్తోంది.

కొబ్బరి బోర్డు కల తీరేనా?

(5వ పేజీ తరువాయి)

అది విజయవాడకు తరలిపోయింది. దాంతో తెలంగాణలో కొబ్బరి సాగును ప్రోత్సహించేందుకు సరైన మార్గం కరువైంది.

తోట పంటలకు కేంద్రంగా భద్రాద్రి జిల్లా..

ఏపీకి సరిహద్దున్న ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తోట పంటలకు కేంద్రంగా ఉంది. ముఖ్యంగా పామాయిల్, మామిడి, కొబ్బరి వంటి తోటలు ఈ జిల్లాలో అత్యధికంగా సాగవుతున్నాయి. అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, పాల్వంచ, భద్రాచలం, బూర్గంపాడు, కొత్తగూడెం, సుజాతనగర్, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి మండలాలతో పాటు ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో విస్తారంగా కొబ్బరితోటలు సాగవుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా సరిహద్దులో వరంగల్, ములుగు ఏపీలోని కృష్ణా జిల్లాల్లోనూ రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తే మరికొంతమంది రైతులు కొబ్బరి సాగుపై ఆసక్తి చూపుతారని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి విన్నవించారు.

పరిశోధనలకు అవకాశం..

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో ఇప్పటికే వ్యవసాయ కళాశాల ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులను ఈ కళాశాలలో చదివి వ్యవసాయ శాస్త్రవేత్తలుగా, వ్యవసాయ అధికారులుగా పని చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కొబ్బరి అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేస్తే కొబ్బరి సాగుపై పరిశోధనలు పెరిగే అవకాశం ఉంటుంది. కొత్తగూడెంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఎర్త్‌సైన్స్ యూనివర్శిటిని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భూములను సస్యశ్యామలం చేసుకునేందుకు కసరత్తు చేస్తోంది. అదే జరిగితే అన్ని రకాల పంటలు పండించుకునేందుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే భద్రాద్రి జిల్లాలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ పనితీరు పరిశీలించిన సెంట్రల్ అధికారి

కూసుమంచి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారులు సంజిత్ ఆదేశించారు. మంగళవారం ఖమ్మంజిల్లాలో మిషన్ భగీరథ ప్రాజెక్టు పనితీరును పరిశీలించారు. కూసుమంచి మండలంలో పాలేరు ఇన్‌టెక్‌వెల్‌ను పరిశీలించారు. పాలేరు జలాశయం నుంచి మిషన్ భగీరథ ద్వారా నీటిపంపిణీ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జీళ్లచెరువులో డబ్లుపీటీ వద్ద నీటి శుద్ధీకరణ ఎలా జరుగుతుంది..? శుద్ధీకరణ అనంతరం గ్రామాలకు ఏవిధంగా శుద్ధ జలాలు పంపిణీ చేస్తున్నారో స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎటువంటి అవాంతరాలు ఎదురవకుండా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా శుద్ధ జలాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌డీవో సన్యాసయ్య, మిషన్ భగీరథ ఎస్ఈ శేఖర్‌రెడ్డి, ఈఈ వాణిశ్రీ, డీఈ ఓంప్రకాష్, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ బడిబాటలో పాల్గొన్న ఖమ్మం మేయర్

ఘనంగా అమ్మమాట.. అంగన్‌వాడీ బడిబాట

(5వ పేజీ తరువాయి)

డీడబ్ల్యూవో కె.రాంగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూవో మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పిల్లలు ఉత్సాహంగా వచ్చేందుకు మంచి వాతావరణం కల్పించాలన్నారు. వారానికి రెండు రోజులు ఎగ్ బిర్యానీ వడ్డించాలనే ఆలోచన ఉందన్నారు. ఇంటి వాతావరణాన్ని మరిపించేలా కేంద్రాలు ఉండాలని, స్థానిక స్వయం సహాయక సంఘాల సహకారంతో హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని, ఈనెల 17వరకు సన్నద్ధత కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో కిండర్ గార్డెన్ తరహాలో శిక్షణ కార్యక్రమాలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లాలో ఖాళీగా ఉన్న 203అంగన్‌వాడీ టీచర్లు, 616 ఆయాల పోస్టులను త్వరలో భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో 293 కేంద్రాల్లో మరుగు దొడ్లు నిర్మాణం కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కమల ప్రియ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శాకీరా, అంగన్వాడీ టీచర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖపై బకాయిల భారం

(5వ పేజీ తరువాయి)

(డబ్ల్యుడబ్ల్యుశాఖ)లో ఏడు కనెక్షన్ల నుంచి రూ.23.87కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. నీటిపారుదలశాఖలో 28సర్వీసులకు గాను రూ.45.22కోట్ల బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ అండర్‌టేకింగ్‌కు సంబంధించిన వివిధ బ్యాంకుల నుంచి 15సర్వీసులకు గాను రూ.1.86లక్షలు, ఆర్‌డబ్ల్యుఎస్ 11 సర్వీసుల నుంచి రూ.67.56లక్షలు, పోస్టల్‌శాఖ నుంచి 9 సర్వీసులకు గాను రూ.0.21లక్షలు, ఎఫ్‌సీఐ నుంచి 2 సర్వీసులకు గాను రూ.0.20లక్షల బకాయిలు ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వశాఖలో ఎక్కువ బకాయిలు ఉన్న శాఖలు మైనర్ పంచాయతీ (డబ్ల్యుడబ్ల్యు) 1,475 సర్వీసులకు గాను రూ. 1,935.62 లక్షలు మైనర్ పంచాయతీ (ఎస్టీఎల్) 2,574 సర్వీసులకు గాను రూ.14,52.36లక్షలు, మేజర్ పంచాయతీలు (డబ్ల్యుడబ్ల్యు) 104 సర్వీసులకుగాను రూ.185.63లక్షలు, మేజర్ (ఎస్టీఎల్) 422 సర్వీసులకు గాను రూ.130.06లక్షలు, మున్సిపల్ శాఖ (ఎస్టీఎల్) 563 సర్వీసులకు గాను రూ.290.01లక్షలు, మున్సిపల్ (డబ్ల్యుడబ్ల్యు) 130 సర్వీసులకు గాను రూ.242.25లక్షలు, విద్యాశాఖ 204సర్వీసులకుగాను రూ.212.44లక్షలు, పిషరీష్ 85సర్వీసులకు గాను రూ.162.65లక్షలు, సోషల్ వెల్ఫేర్ శాఖ 718 సర్వీసులకు గాను రూ.415.47లక్షల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు కావడంతో బకాయిల వివరాలు ఎప్పటికప్పుడు ఆయాశాఖలకు విద్యుత్‌శాఖ అధికారులు తెలియచేస్తున్నా ఆయా బిల్లులకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఆయా శాఖలకు నిధులు విడుదలైతే బిల్లులు చెల్లించే అవకాశం ఉన్నా అప్పటి వరకు అవసరమైన నిధుల కోసం విద్యుత్‌శాఖ అధికారులు బ్యాంకుల నుంచి రుణాలను తీసుకోక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వ శాఖలు విద్యుత్ బకాయిలను చెల్లించాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు.

కమ్యూనిస్టులు ఏకమైతే ఎర్రకోటపై ఎర్ర జెండా ఎగురుతుంది

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎర్రజెండా పార్టీలు ఐక్యంగా ముందుకు వచ్చిన రోజున ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరడం తథ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాండురంగాపురంలో సీపీఐ పాల్వంచ మండల 19వ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయవిచారణకు ఆదేశించాలన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపారు. ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని, 2026మార్చి 31వరకు నక్సలైట్లను అంతమందిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరి ఎన్‌కౌంటర్లు చేస్తుండటం మరో పక్క తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికి పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంఆనే ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టవల్సిన అవసరం ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాగరాజు, అప్పారావు, నిమ్మల రాంబాబు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, జిల్లాసమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వి. పద్మజ, ప్రజాసంఘాల నాయకులు చెన్నయ్య, వేముల కొండలరావు, అన్నారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మత్కేపల్లిలో వ్యవసాయ మార్కెట్

(5వ పేజీ తరువాయి)

భద్రాచలం, చర్ల, ఇల్లెందు, దమ్మపేట వ్యవసాయమార్కెట్లున్నాయి. ఈ మార్కెట్లలో పత్తి, మొక్కజొన్న, మిర్చి, పెసలు, కందులు, వేరుశనగ, మినుములు, పలురకాల వాణిజ్య, ఆహార, నూనె గింజల పంటల క్రయవిక్రయాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖకు ఉమ్మడి జిల్లా నుంచి ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది.

మత్కేపల్లి మార్కెట్‌తో రైతులకు సౌలభ్యం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మత్కేపల్లి ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు ద్వారా ఖమ్మం మార్కెట్‌పై కొంత భారం తగ్గుతుందని, చింతకాని, ముదిగొండ మండలాల రైతులకు సౌలభ్యంగా కూడా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా మండలాల రైతులు తమ సమీపంలోని మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునే అవకాశం కలుగుతుందని, వారికి రవాణా ఖర్చుల భారం కూడా తగ్గుతుందని ఆయన వివరించారు. పత్తి, మొక్కజొన్న తదితర పంటలను దళారుల బారిన పడకుండా నేరుగా మార్కెట్ యార్డులో గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చన్నారు.

క్రైం సమాచారం

ఈతకు వెళ్లి వ్యక్తి మృతి


హరికృష్ణ (ఫైల్)

నేలకొండపల్లి, జూన్10 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని రాజేశ్వరపురం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల వివరాలు ప్రకారం.. రాజేశ్వరపురానికి చెందిన రెడ్డిబోయిన హరికృష్ణ(35) తన కుమారుడిని తీసుకుని శ్మశానం సమీపంలోని ఓవ్యవసాయ బావిలో ఈత కొట్టటానికి వెళ్లాడు. కుమారుడు బావి ఒడ్డున ఉండగా హరికృష్ణ ఈత కొట్టటానికి బావిలోకి దూకాడు. బావిలో ఈత కొట్ట లేక మనిగిపోయినట్లు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బావిలో నుంచి మృతదేహన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. హరికృష్ణ భార్య కల్యాణి ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యప్రదేశ్ యువకుడి ఆత్మహత్య


నీరజ్ మృతదేహం

జూలూరుపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కూలీ పనుల కోసం వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బక్వార గ్రామానికి చెందిన నీరజ్ రఘువంశీ(21) భార్య అల్పారఘువంశీతో కలసి కూలి పనులు చేసుకునేందుకు పది రోజుల క్రితం జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం గ్రామానికి వచ్చారు. తాళ్లూరి చలపతిరావు అనే రైతు పామాయిల్ తోటలో వారిద్దరు కూలీలుగా చేరారు. సోమవారం రాత్రి నీరజ్ రఘువంశీ అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య అల్పా ఎందుకు ఎక్కువగా మద్యం తాగవని భర్తను అడిగింది. ఈ క్రమంలో అతడు భార్యతో గొడవపడ్డాడు. కోపంతో భార్య ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోగా మనస్తాపానికి గురై ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం భార్య ఇంటికి రాగా భర్త మృతిచెంది ఉన్నాడు. దీంతో ఆమె విషయాన్ని చుట్టు పక్కల వారికి తెలియజేసి వారి సహాయంతో మృత దేహన్ని కిందకు దించింది. భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు తెలిపారు.

రేపు వాహనాల వేలం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-1 పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను వేలం ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామని ఎస్‌హెచ్‌వో కృష్ణ మంగళవారం ఒక ప్రకటనల తెలిపారు. ఈనెల 12న ఉదయం 11గంటలకు కార్యాలయం వద్ద ఆరు ద్విచక్ర వాహనాలకు వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదల్చిన వారు ఉదయం 11గంటల లోపుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నిద్రిస్తుండగా అర్ధరాత్రి మహిళ మెడలో గొలుసు చోరీ

చండ్రుగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి బయట నిద్రిస్తున్న బండి రాధ అనే మహిళ మెడలో నాలుగు తులాల(రూ3.5 లక్షల విలువైన) గొలుసు చోరీకి గురైంది. ఈ ఘటన చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. భర్త జోగయ్య, రాధ ఇరువురు ఇంటి ముందు బయట నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రాధ మెడలో ఉన్న గొలుసు, మంగళ సూత్రాన్ని గుంజుకున్నారు. ఈ సమయంలో రాధ, ఆమె భర్త మేల్కొని కేకలు వేశారు. అప్పటికే దొంగలు చీకట్లో కనిపించకుండా పోయారు. ఎస్‌ఐ శివరామకృష్ణ, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని దొంతనం జరిగిన తీరును పరిశీలించారు. మంగళవారం ఉదయం డీఎస్పీ రెహమాన్ సైతం దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా గ్రామస్థుల సమాచారం మేరకు గ్రామంలో సంచరిస్తున్న ఓ అపరిచిత మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రూ.24లక్షలకు వ్యాపారి దివాలా పిటీషన్

ఖమ్మం లీగల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ఖిల్లా బజార్ ప్రాంతానికి చెందిన షేక్ ఇలియాస్ ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం 11మంది ప్రతివాదులపై దివాలా పిటీషన్ దాఖలు చేశాడు. దివాలాదారు కొన్ని సంవత్సరాలుగా పాత ఇనుము వ్యాపారంచేస్తూ వ్యాపార అభివృద్ధి కొరకు బంధువులు, స్నేహితుల వద్ద అధిక మొత్తంలో వడ్డీకి రుణాలు తీసుకొన్నాడు. వ్యాపారంలో పెట్టుబడి పెట్టగా నష్టాలు రావటంతో రుణదాతలు ఒత్తిడి అధికమవటంతోపాటు అప్పులు తీర్చే మార్గం లేక కోర్టులో దివాలా పిటీషన్ దాఖలు చేశాడు.

అనుమానాస్పద స్థితిలో పాస్టర్ మృతి


యేసేబు(ఫైల్)

మణుగూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మణుగూరు మండల పరిధిలోని మల్లెపల్లి గోదావరి పడవ రేవు వద్ద ఓ వ్యక్తి మృతదేహన్ని మంగవారం స్థానికులు కనుగొన్నారు. మూడు రోజులుగా ఈ వ్యక్తికి సంబంధించిన బైక్ గోదావరి ఒడ్డున ఉండటంతో అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే మంగళవారం ఇదే ప్రాంతంలో ఓ మృతదేహం గోదావరిలో తేలుతూ కన్పించింది. మృతిచెందిన వ్యక్తి పినపాక మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన షైనా యేసేబు(40)గా గుర్తించారు. క్షవరం చేసుకుని మణుగూరులోని మల్లేపల్లి ప్రాంతంలో గోదావరిలో స్నానం ఆచరించేందుకు దిగి ప్రమాదవశాత్తు మునిగి ఉంటాడని పలువురు భావిస్తున్నారు. మృతుడు మణుగూరులో పనిచేసే సొసైటీలో యాజమాన్య ఒత్తిడి మూలంగానే ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపనలు కూడా వినవచ్చాయి. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 98 మందికి జరిమానా

కొత్తగూడెం లీగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన కేసుల్లో కొత్తగూడెం కోర్టులో 98మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు మంగళవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం వన్ టౌన్ ఎస్‌ఐ తుంగ రాకేష్, జి. విజయ, టూటౌన్ ఎస్‌హెచ్‌వో ప్రతాప్, కొత్తగూడెం త్రీటౌన్ ఎస్‌ఐ పురుషోత్తం, లక్ష్మీదేవిపల్లి ఎస్‌హెచ్‌వో జి. రమణారెడ్డి, సుజాతనగర్ పరిధి ఎస్‌హెచ్‌వో జి. రమాదేవి, పాల్వంచ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి. సురేస్, చంద్రుగొండ ఎస్‌హెచ్‌వో పి. శివరామకృష్ణ చుంచుపల్లి ఎస్‌హెచ్‌వో జి. రవికుమార్ తమ బృందాలతో వాహన తనిఖీలు చేయగా వేర్వేరు ప్రాంతాల్లో 98 మంది వ్యక్తులను బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా వారు మద్యం సేవించినట్లు రుజువైంది. కాగా కోర్టులో ప్రవేశపెట్టగా వారు నేరం ఒప్పుకుని మేజిస్ట్రేట్ ముందు జరిమాన చెల్లించారు.

నలుగురు జూదరుల అరెస్ట్

తల్లాడ, జూన్10(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి నలుగరు జూదరులను అరెస్టుచేశారు. తల్లాడ ఎస్‌ఐ ఎన్. వెంకటకృష్ణ ఆధ్వర్యంలో దాడిచేసి పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

‘విద్యుత్ అంబులెన్స్’లు


టీజీ ఎన్పీడీసీఎల్ రూపొందించిన విద్యుత్ అంబులెన్స్

- తక్షణ సరఫరా పునరుద్ధరణకు ఎమర్జెన్సీ రీస్టోర్ బృందాలు
- 24గంటలు అందుబాటులో సేవలు
- తొలి విడతలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 4 వాహనాలు
- టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 33 వాహనాల కొనుగోలు
- నేడు ఖమ్మంలో ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే నిమిషాల్లో సరఫరాను పునరుద్ధరించడానికి తెలంగాణ నార్తెన్ పవర్ డిస్ట్రిబ్యూషన్(టీజీ ఎన్పీడీసీఎల్) సంస్థ వినూత్నంగా జిల్లా, డివిజన్ స్థాయి వరకు ఎమర్జెన్సీ రీస్టోర్ టీం(ఈఆర్‌టీ) వాహనాలను ఏర్పాటు చేసింది. ఈ వాహనాలను 'విద్యుత్ అంబులెన్స్'లుగా పిలుస్తున్నారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్‌ను సరఫరా చేయటమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి విడతగా ఖమ్మం నగరానికి 2, మధిర 1, కొత్తగూడెం పట్టణానికి 1 వాహనాలను కేటాయించారు. ప్రతి డివిజన్‌కు సేవలందించేలా అంబులెన్స్‌ల సంఖ్య దశల వారీగా పెంచనున్నారు.

24గంటలు అందుబాటులో వాహనాలు..

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన ఎమర్జెన్సీ రీస్టోర్ టీం అంబులెన్స్ వాహనాలకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి, పరికరాలను సమకూర్చారు. ఒక్కో వాహనంలో విద్యుత్ సాంకేతిక నైపుణ్యంతో పాటుగా శారీరక శ్రమ చేయగలిగిన ఆరుగురిని నియమించారు. జీపీఎస్ విధానంలో రవాణా చేసే అంబులెన్స్ వాహనంలో థర్మో విజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్‌లైట్లు, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండకర్లు, కేబుల్స్ అందుబాటులో ఉంటాయి. ఈ వాహనాలు 24/7 అందుబాటులో ఉంటాయి.

1912 టోల్‌ఫ్రీ నెంబర్

విద్యుత్ సమస్యను ఎదుర్కొన్న వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయగానే విద్యుత్ ఫిర్యాదు నమోదవుతుంది. తర్వాత ఆ ప్రాంతంలోని విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సమస్య తీవ్రతను అనుసరించి అంబులెన్స్ వాహనాన్ని పంపుతారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన ప్రాంతానికి సిబ్బంది నిమిషాల్లో చేరుకుంటారు. అడ్డంకులు తొలగించి ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు.

నేడు వాహనాల ప్రారంభం

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే కొనుగోలు చేసిన 33 (ఈఆర్‌టీ) విద్యుత్ అంబులెన్స్ వాహనాలు మంగళవారం ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానానికి చేరుకున్నాయి. బుధవారం ఉదయం 10గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క , సీఎండీ వరుణ్‌రెడ్డి విద్యుత్ ఈఆర్‌టీ వాహనాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు శాఖాపరమైన ఏర్పాట్లను టీజీ ఎన్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి పూర్తి చేశారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- శాసన మండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న


మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

ఖమ్మం చర్చికాంపౌండ్, జూన్10(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీసీ రిజర్వేసన్, బహుజన రాజ్యాధికార సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ ఎమ్మెల్యే లేని ఒకే జిల్లా ఖమ్మం జిల్లా మాత్రమేనన్నారు. ఖమ్మం జిల్లానుంచి ఒక్క బీసీ ఎమ్మెల్యే కూడా చట్టసభలకు పోలేదన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే 42శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనన్నారు. ఈ రిజర్వేషన్లు కేంద్రం ఆమోదించాలని పాలకులు కుంటి సాకులు చెబుతున్నారన్నారు. ఎంతో చైతన్యవంతమైన ఖమ్మం జిల్లానుంచి బీసీ ఎమ్మెల్యే లేకపోవడం శోచనీయమన్నారు. పాలకులు విద్యా, వైద్యాన్ని వ్యాపారంగా మార్చి బీసీలకు, పేదలకు అందకుండా చేశారన్నారు. అందుకే రాష్ట్రంలో బీసీ రాజ్యం రావాలన్నారు. అందుకే బీసీల పార్టీ ఏర్పాటుచేస్తామన్నారు. బీసీ పార్టీ ఏర్పాటుకు ఈజిల్లాలో ఉద్యమకారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ జిల్లా ప్రజలు ఎంతో చైతన్యవంతులు, తెలంగాణ ఉద్యమంలో మొదటగా పాల్గొన్నది ఈ జిల్లా వాసులేనన్నారు. ఖమ్మం గడ్డపై బీసీల సత్తాచాటాలన్నారు. ఈసదస్సులో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ అన్ని సమస్యలకుపరిష్కారం బహుజన రాజ్యమేనన్నారు. ఖమ్మం ప్రజలు చైతన్యవంతమైన ప్రజలని బహుజన రాజ్య ఉద్యమం ఇక్కడి నుంచే ప్రారంభం కావాలన్నారు. ఈ సదస్సులో బీసీజనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారామ్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బానోతు భద్రునాయక్, బీసీ జేఏసీ నాయకులు ఒట్టే జానయ్యయాదవ్, పసుపులేటి నాసరయ్య, పాల్వంచ రామారావు, ఆకుల గాంధీ, పొడకంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ విద్యార్థుల పట్ల అమెరికా దుర్మార్గ వైఖరి వీడాలి

- ఇమ్మిగ్రేషన్ అధికారుల తీరు అమానుషం
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చదువు, చిన్న కొలువు, ఉపాధి కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థుల పట్ల ఆ దేశం విధానాలు దుర్మార్గ వైఖరి అవలంబిస్తోందని, అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారుల తీరు తీవ్ర అమానుషంగా ఉందని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారతీయ విద్యార్థుల చేతులు వెనక్కు విరిచికట్టి తొక్కిపెట్టి బలవంతంగా అదుపులోకి తీసుకోవటం అనాగరికమని ఆరోపించారు. భవిష్యత్‌పై కోటి ఆశలతో అమెరికాకు వెళ్లిన విద్యార్థులు ఏజెంట్లు చేసే తప్పిదాలతో ఇబ్బందులకు గురైతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని, తన ప్రియమిత్రుడు ట్రంప్‌తో చర్చలు జరిపి భారతీయ విద్యార్థుల గౌరవాన్ని కాపాడాలని పోటు రంగారావు డిమాండ్ చేశారు.

గంజాయి కేసులో 8మంది అరెస్ట్

అశ్వారావుపేట రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న ఎనిమిది మంది యువకులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ నాగరాజురెడ్డి అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం గతనెల 8న అశ్వారావుపేటలోని భద్రాచలం రోడ్‌లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమాస్పదంగా కనిపించిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2.75లక్షల విలువైన ఐదున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మూడు వాహనాలు, ఆరు ఫోన్‌లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. విచారణలో ఇదే కేసులో సంబంధం ఉన్న తుపాకుల నరసింహారావు, గతాల రాకేశ్, రమేశ్, పమ్మిడి మణికంఠ, ముళ్లగిరి రమేశ్, అనిల్, ఇర్షాద్, మస్తాన్ వలీ అనే 8మంది నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు

రఘునాథపాలెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందారు. రఘునాథపాలేనికి చెందిన మేక వెంకటేశ్వర్లు(48) సెంటర్లో దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈనెల 5వ తేదీన వెంకటేశ్వర్లు ఇంటి నుంచి రాత్రి 7.30గంటల సమయంలో బైక్‌పై ఖమ్మం వెళ్తుండగా గ్రామంలోనే ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. కిందపడిపోయిన వెంకటేశ్వర్లు తలకు వెనుక భాగంలో బలమైన గాయమైంది. తర్వాత ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు.

పురుగుల మందు తాగి యువకుడు...

దమ్మపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు ఖమ్మంలో మంగళవారం మృతి చెందాడు. మొద్దులగూడెం గ్రామానికి చెందిన మల్కారపురం సత్యనారాయణ(24) పనులు చేయకుండా తిరుగుతుండటంతో కుటుంబసభ్యులు మందలించారు. మనస్తాపం చెందిన సత్యనారాయణ మొద్దులగూడెం క్రాస్‌రోడ్ వద్దగల ఏకుల పోతమ్మ ఆలయ సమీపంలో ఆదివారం ఉదయం పురుగులమందు తాగి ఈవిషయాన్ని సెల్‌ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే సంఘటనా స్థలానికి బంధువులు చేరుకొని సత్తుపల్లి, ఖమ్మం వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. తల్లి రుక్మిణి దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బీటీ-3 అమ్మేవారిపై క్రిమినల్ కేసులు

- వ్యవసాయ అధికారి నరసింహారావు

ఏన్కూరు, జూన్10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన బీటీ-3పత్తి విత్తనాలు అమ్మేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏవో నరసింహారావు హెచ్చరించారు. రేపల్లెవాడ గ్రామంలో మంగళవరం పత్తి చేలను సందర్శించారు. ఈసందర్భగా రైతులకు సలహాలు అందించారు. భూమిలో 60-70శాతం తేమ ఉన్నప్పుడు మాత్రమే విత్తనాలు విత్తాలన్నారు. పొడుదుక్కుల్లో విత్తి నష్టపోవద్దన్నారు. లైసెన్సుకలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు బాలకృష్ణ, శ్రీకాంత్ నవ్య, భవ్య, లహరి పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

చింతకాని, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళను బెదిరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన షేక్ షభాన ఇంటి గేటు వద్ద ఈ నెల 5వ తేదీన అదే గ్రామానికి చెందిన శీలం రామలింగయ్య అనే వ్యక్తి ట్రాక్టర్ అడ్డుగా పెట్టి బెదిరించాడు. ఈ దారిలో వెళ్తే చంపేస్తానని బెదిరించడంతో, మంగళవారం షభాన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్ మీరా తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

భద్రాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఈ నెల 7వ తేదీన జరిగిన కణితి సతీష్ హత్యకేసులో ప్రధాన నిందితుడు, భద్రాచలానికి చెందిన గుంజా సాయిరాంను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మంగళవారం తెలిపారు.

హత్య జరిగిన అనంతరం నిందితుల కోసం మూడు పోలీసు బృందాలను ఏర్పాటుచేసి వారి ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు సాయిరాంను సోమవారం అరెస్టుచేసి భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి ఎదుట హాజరుపరిచామన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ ఎం.నాగరాజు, ఎస్‌ఐలు స్వప్న, సతీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

1.09 లక్షల విలువైన మిర్చి విత్తనాల స్వాధీనం

- ఇద్దరిపై కేసు, రిమాండ్‌కు తరలింపు
- వ్యవసాయ అధికారులు, పోలీసుల సంయుక్త దాడి


సీజ్ చేసిన కారు, నిందితులను చూపిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

జూలూరుపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అనుమతి లేని మిర్చి విత్తనాలను గ్రామాల్లోని రైతులకు విక్రయిస్తుండగా పోలీసులు, వ్యవసాయశాఖ సిబ్బంది కలసి సంయుక్తంగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. మంగళవారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పెద్ద కోరుకొండి గ్రామానికి చెందిన జనతా సీడ్స్ మార్కెటింగ్ మేనేజర్ నున్నా మహేష్, ఏన్కూర్ మండలం జన్నారం గ్రామానికి చెందిన పల్లపు తిరపతరావు ఇద్దరు కలసి కొంత కాలం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో గల జనతా సీడ్స్ దుకాణం నుంచి మిర్చి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆ విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నారని అన్నారు. కల్లూరు, ఏన్కూర్, జూలూరుపాడు, బయ్యారం మండలంలోని రైతుల వద్దకు వెళ్లి ఈ మిర్చి విత్తనాలను సాగు చేస్తే ఎక్కువ దిగుబడులు వస్తాయని మాయ మాటలు చెప్పి అధిక ధరకు విక్రయిస్తు లాభాలు గడిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం వారిద్దరు టీజీ 04ఏ0158 నెంబర్ కారులో మిర్చి విత్తనాలను తీసుకుని అనంతారం గ్రామంలో రైతులకు విక్రయించేందుకు వచ్చారని, ప్రభుత్వ అనుమతులు లేకుండా మిర్చి విత్తనాలను అనంతారంలో రైతులకు అమ్ముతున్నారని ఏవో దీపక్ ఆనంద్‌కు సమాచారం వచ్చిందన్నారు. దీంతో పోలీస్, వ్యవసాయశాఖ సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి అనంతారం గ్రామంలో తనిఖీలు చేయగా రైతు పాలెపు శివకృష్ణ ఇంటి వద్ద మిర్చి విత్తనాల ప్యాకెట్లతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి రూ. 1.09లక్షల విలువ చేసే ప్రజ్వల్ సీడ్స్ కంపెనీ వారి కావ్యా సీడ్స్ రకానికి చెందిన 115 మిర్చి విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. దీంతో వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో ఒక్కొక్క విత్తన ప్యాకెట్‌ను రూ. 600లు కొనుగోలు చేసి వాటిని తెలంగాణలోని రైతులకు రూ. 950లకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారన్నారు. వారి వద్ద నుంచి రూ. 13వేల నగదు, రెండు సెల్‌పోన్లను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నున్నా మహేష్ గతంలో గుంటూరులో జనతా సీడ్స్ దుకాణంలో పనిచేశాడు. వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఏవో బాబురావు, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై బాదావత్ రవి, ఏవో దీపక్‌ఆనంద్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

భక్త జన రామయ్య

- మూడేళ్లుగా మే నెలలో పెరుగుతున్న రద్దీ
- ఏటికేడు అధికమవుతున్న ఆదాయం..


ఈ ఏడాది మే 23న రామాలయంలో భక్తుల సందడి

భద్రాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని వేసవి సెలవుల సమయమైన మే నెలలో భక్తులు భారీగా దర్శించుకుంటారు. ఈ క్రమంలో గత మూడేళ్లుగా రామయ్యను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరగడంతో పాటు ఆదాయం సైతం అదే రీతిలో ప్రతి ఏటా మే నెలలో పెరుగుతుండటం గమనించదగ్గ విషయం. 2023లో సుమారు రెండు లక్షల మంది రామయ్యను దర్శించుకోగా రూ.3.98 కోట్లు ఆదాయం మే నెలలో రామాలయంకు రావడం జరిగింది. 2024లో 2.48 లక్షల మంది భక్తులు రామయ్యను దర్శించుకోగా రూ.4.37 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా తాజాగా ఇటీవల మే నెలలో రామయ్యను 2.88 లక్షల మంది దర్శించుకోగా రూ.5.06 కోట్లు ఆదాయం రామాలయానికి రావడం విశేషం. ఈ విధంగా ప్రతి ఏడాది మే నెలలో రామయ్యను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతుండగా అదే సమయంలో ఆదాయం సైతం దేవస్థానానికి పెరిగింది.

సహాయ సామగ్రి కోసం దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి/ కొత్తగూడెం అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు 2024-25వ సంవత్సరానికి గాను సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల శాఖ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, భద్రాద్రి జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక వైకల్యం, బధిరులు, అంధులకు సహాయార్థం సంబంధిత సహాయ ఉపకరణాల పంపిణీకి ఆన్‌లైన్‌లో ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ధ్రువపత్రాలతోపాటు దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

20, 21 తేదీల్లో ఖమ్మంలో జాతీయ స్థాయి సాహిత్య సదస్సు

- హాజరు కానున్న ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ ఆర్ డిగ్రీకళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజులపాటు జాతీయస్థాయి సాహిత్యసదస్సు జరుగనుంది. శతజయంతి సాహితీ మూర్తులు పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో మహాకవి దాశరథి, ఆరుద్రల సాహిత్య ఘనతను ఘనంగా చాటిచెపుతారు.

ఈసదస్సులో పాల్గొనేందుకు దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన యూనివర్సిటీల ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, కవులు హాజరుకానున్నారు. ఈసందర్భంగా 75 మంది ఆహుతులు దాశరథి ఆరుద్రలపై పత్రసమర్పణ చేస్తారు.



అనుమతులు లేని పాఠశాలలను రద్దు చేయాలి

ఖమ్మం రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పుణుకుల సుధాకర్ డిమాండ్ చేశారు. ఏదులాపురం మునిసి పాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవనంలో మంగళ వారం జరిగిన పాలేరు డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశా లల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశా లలు నడుపుతున్నారని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకుం డా పోయిందన్నారు. విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈకార్యక్ర మంలో జిల్లా కమిటీ సభ్యులు హరీష్, సాయి కృష్ణా, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో విపత్తులను ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న ఆర్ఎంవో రాంబాబు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలు.. వరదల లాంటి విపత్కర సమయాల్లో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ తమను తాము కాపాడుకుంటూనే పలువురిని కాపాడే ప్రయత్నం చేయాలని జిల్లా జనరల్ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ బి. రాంబాబు, లెఫ్టినెంట్ కమాండెంట్ కల్నల్ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి ఆపత్కాల సమయంలో, విపత్తులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

తిరుమలాయపాలెం, జూన్10(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టీన రేందర్‌రావు పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లయిన సందర్భంగా మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో అవినీతి లేకుండా శాంతిభద్రతలకు భంగం లేకండా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో బొడ్డుపల్లి ప్రసాద్, గుండా శ్రీనివాసరెడ్డి నల్లగట్టు శ్రీను, సంతోష్‌రెడ్డి, పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ముజాహిద్‌పురంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నరేష్‌రెడ్డి

తిరుమలాయపాలెం, జూన్10(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ పక్కా గృహాలను ప్రభుత్వం అందిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ము జాహిద్‌పురం బడితండా, జెండాలతండా, తదితర గ్రామాల్లో 30మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అందించారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పాలేరు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈకార్యక్రమంలో సుమన్‌రెడ్డి, బత్తుల వెంకటనారాయణ, తుళ్లూరు నాగరాజు, రవి, సుమన్, నవీన్, వినయ్ తదితరులున్నారు.

వృత్తి హక్కులు కేటాయించాలని వినతి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్10(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ కుల వృత్తి నాయీబ్రాహ్మణులకే చెందేవిధంగా ప్రత్యేక జీవో జారీచేసి న్యాయం చేయాలని ఖమ్మం నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం వచ్చిన బీసీసంక్షేమ శాఖ మంత్రి పొన్నంప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు కులవృత్తులను కాపాడుతాం అంటూనే, మరోవైపు ఇతర కులస్తులకు మా మంగలి కులవృత్తి అయిన సెలూన్‌షాపులు పెట్టుకొవడానికి ట్రేడ్ లైసెన్సు ఇవ్వడం వల్ల మా జీవనోపాధిని కొల్లగొడుతున్నారన్నారు. వెంటనే కార్పొరేట్ షాపులు తొలిగించి మాకు న్యాయం చేయాలన్నారు. మాకులవృత్తి మాకే చెందే విధంగా పేటెంట్ హక్కు కల్పించి వేల కుటుంబాలను కాపాడాలని కోరారు. నాయీబ్రాహ్మణులు వృత్తి హక్కు కలిగే విధంగా జీవో జారీచేయాలని, కార్పొరేట్ సెలూన్ షాపులు తొలిగించాలని కోరారు. ఈకార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'విజయ'లో ఘనంగా వీడ్కోలు వేడుక



మాట్లాడుతున్న మోహ్నిష్

కొణిజర్ల, జూన్10(ఆంధ్రజ్యోతి): స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కంపెనీ సీఈవోలు, పెట్టుబడిదారులు స్టూడెంట్ ట్రైబ్‌కు చెందిన శ్రీచరణ్ లక్కరాజు, లీడర్స్ ఫర్ ఇండియా ఆర్గనైజేషన్(ఎల్ఐఓ)ఎర్ర మోహ్నిష్, షైకాప్ ఇన్వెస్ట్‌మెంట్స్ డైరెక్టర్ పారుపల్లి శ్రీకవిత హాజరయ్యారు. ముందుగా కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, అతిథులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా తమ ఆటపాటలతో అలరించారు. ఈసందర్భంగా శ్రీచరణ్‌లక్కరాజు విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. సమాధానం చెప్పిన ముగ్గురు విద్యార్థులకు వెంటనే ఇంటర్‌షిప్‌ను ఆఫర్ చేశారు. అనంతరం మోహ్నిష్ ఎర్ర మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. విజయ విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ అయేషాతరుణం, డీన్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఫరీద్‌బాబా తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్

వారం రోజుల్లో విపత్తును చక్కదిద్దాం

- నాడు 103 జ్వరంలోనూ మంత్రి తుమ్మల వరద ముంపులో పర్యటించారు
- మేయర్ పునుకొల్లు నీరజ



సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 103 డిగ్రీల జ్వరంలోనూ ఎంతో ఓపిగ్గా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల బాగోగులు పట్టించుకున్నారని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నయాబజార్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలకు బీమాపై అవగాహన సభ రాజకీయ రంగు పులుముకొంది. సభకు 46, 47, 48 డివిజన్లకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ గతేడాది మున్నేరు వరద నష్టాలను తెలుసుకొని బాధితుల పక్షాన ఖమ్మం నగర పాలకవర్గం నిలబడిందన్నారు. మళ్లీ విపత్తులు జరిగితే భారీ నష్టం జరగకుండా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య బ్యాంకర్లుతో మాట్లాడి బీమా అవగాహన సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రిటైనింగ్ వాల్ ఖాళీగా ఉన్న పాంతాల్లో వేగంగా జరుగుతుందన్నారు. నివాసాలు ఉన్న ప్రాంతాల్లో జాప్యం జరిగిందన్నారు. కట్టుబట్టలతో కుటుంబాలు వీధిన పడిన రోజులు తనకు గుర్తు ఉన్నాయన్నారు. అటువంటి విపత్తులను మళ్లీ రాకుడదన్నారు. ప్రత్యేకంగా రెవెన్యూ క్యాంపులు పెట్టి వరదల్లో కొట్టుకుపోయిన ధృవపత్రాలను తిరిగి ఇవ్వడం జరిగిందన్నారు. పది వేలకు పైగా బాధితులకు పరిహారం అందించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, మెప్మా ఆర్పీలు సిబ్బంది విశేషంగా కృషి చేశారన్నారు. పునరావాస కేంద్రాలను వెనువెంటనే ఏర్పాటు చేశామన్నారు. మున్నేరు బాధితులను రక్షించటం, పరిహారం చెల్లించడంలో మంత్రి తుమ్మల విశేషంగా కృషి చేశారన్నారు.

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ తొట రామారావు మాట్లాడుతూ మున్నేరు వరదలను ఎదుర్కొవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, నాళం సతీష్, బాణాల లక్ష్మణ్ కౌంటర్ ఎటాక్ చేశారు. మున్నేరు వరదల సమయంలో కేవలం వారం రోజుల్లోపుగానే సాధారణ పరిస్థితి తీసుకురావడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా కృషి చేశారని తెలిపారు. తుమ్మల చొరవతోనే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మార్చి 31 వరకు కూడా బాధిత కుటుంబాలకు కుట్టు మిషన్లు నుంచి చేతి వృత్తి పరికరాలు వరకు అనేక విధాలుగా స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం అందించాయన్నారు. విపత్తులను ఎదుర్కొవడం, ప్రజల్ని రక్షించడంలో మంత్రి తుమ్మలకు మంచి అనుభవం ఉందన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని మున్నేరు కరకట్ట ఎత్తును పెంచి నిర్మాణాలు చేస్తున్నారని వివరించారు.

బీమాపై అవగాహన

మున్నేరు ముంపు ప్రాంత ప్రజలకు ఇళ్లు, వస్తువులు, గృహోపకరణాలు, పశువులు, జంతువులకు విపత్తుల బీమాపై అవగాహన కల్పించారు. లీడ్ బ్యాంకు మెనేజరు శ్రీనివాసరెడ్డి, ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రజలకు అవగాహన కల్పించారు. నివాసాలకు బీమా చెయించటం ద్వారా నివాసంలోని అన్ని రకాల వస్తువులకు బీమా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. అద్దెకు ఉంటున్న వారు కూడా ఇంటి యజమాని నుంచి రాత పూర్వక లేఖలు అందిస్తే అద్దే నివాసంలోని వారికి బీమా వర్తింపు చేస్తామన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, కేఎంసీ మెనేజరు బుచ్చిబాబు, ఆర్వో యాకూబ్ పాషా, మెప్మా డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, ఆర్ఐ కవిత, సీవోలు చిలకా ద్రౌపది, గొప్పోజు ఉపేంద్ర, బొల్లికొండ రోజా, ఆర్పీలు ఆర్. పాదం, మొగిలమ్మ, తిరుపతమ్మ, నాగమ్మ, రేఖ, రేణుక, ఉమా, స్వరూప, ప్రయాంక స్థానికులు బల్దే నాగేశ్వరరావు, అక్కిని వెంకన్న, మరాటి రమేశ్, బీరేష్, వంగాల వెంకట్, షేక్ జానీ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- కూసుమంచి ఏడీఏ సరిత



మాట్లాడుతున్న ఏడీఏ సరిత

నేలకొండపల్లి, జూన్10(ఆంధ్రజ్యోతి): నకిలీ, కల్తీ విత్తనాలమ్మే డీలర్లపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి ఏడీఏ సరిత హెచ్చరించారు. మంగళవారం నేలకొండపల్లి రైతు వేదికలో విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డీలర్లు ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలను, ప్రభుత్వ అనుమతి ఉన్న అధీకృత డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే ప్రతి రైతుకు అడిగినా, అడగక పోయినా డీలరు ఖచ్చితంగా బిల్లులను ఇవ్వాలన్నారు. బిల్లును పంట చేతికొచ్చే వరకు రైతులు దాచి ఉంచుకోవాలన్నారు. అదే సమయంలో కొంత మంది గ్రామాల్లో విత్తనాలు, ఎరువులు తక్కువ ధరలకే అమ్ముతామని చెప్పి వస్తుంటారని, అటువంటి వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ సూచించారు. డీలర్లు విత్తనాలకు సంబంధించి రికార్డులను తప్పనిసరిగా రాయాలని, దుకాణాల ముందు స్టాకుకు సంబంధించిన వివరాలు ధరల పట్టికతో సహా ప్రదర్శించాలన్నారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో విత్తన డీలర్లు, ఏఈఓలు పాల్గొన్నారు. అనంతరం నేలకొండపల్లిలోని విత్తన, ఎరువుల దుకాణాలను ఏడీఏ సరిత, మండల వ్యవసాయాధికారి యం.రాధలు తనిఖీ చేశారు.

హెచ్ఐవీ నివారణే ధ్యేయంగా పనిచేయాలి

- జిల్లా వైద్యాధికారి కళావతీబాయి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతీబాయి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా వైద్యాధికారి కళావతీబాయి అన్నారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎన్జీఓలతో జిల్లా అదనపు డీఎంహెచ్‌వో (ఎయిడ్స్ అండ్ లెప్రసీ) డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవీ మనిషిలో ఉన్న స్థితి తెలవదని పరీక్ష ద్వారానే వున్నది లేనిది తెలుస్తుందన్నారు. ఆ తర్వాత ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని అన్నారు. ఒకవేళ హెచ్ఐవీ సంక్రమించినా సరైన చికిత్స ద్వారా .ఎయిడ్స్ గా మారకుండా నిరోదించవచ్చని ఆమె అన్నారు. ప్రజలకు నిరంతరం అవగహన కల్పించి హెచ్ఐవీ,ఎయిడ్స్ ను నివారిద్దామని అన్నారు. ఎయిడ్స్ నివారణలో ఎన్జీవో లదే ప్రముఖ పాత్ర వహించాలన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి సంక్రమించే తీరు, దాన్ని సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అపరిచితులతో లైంగిక సంబందాలకు దూరంగా వుండడం, తప్పనిసరిగా కండోమ్ ఉపయోగించడం, వ్యక్తిగత కారణాల వల్లనే సోకుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందునాయక్, డాక్టర్ బిందుశ్రీ, డాక్టర్ రామారావు, డెమో సుబ్రహ్మణ్యం,స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ (ప్రిసన్స్ అండ్ ఓసీఎస్ ఇంటర్వెన్షన్)వినోద్ సంగం, డిప్యూటీ డెమో సాంబశివరెడ్డి, ఎన్‌హెచ్‌ఎం.డీపీవో దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలు రాకుండా చర్యలు తీసుకోవాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సీజనల్ జ్వరాలు, వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ముందస్తు వైద్య చర్యలు తీసుకోవాలని 6వ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు సూచించారు. మంగళవారం ఖానాపురం ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. డివిజన్‌లో వైద్యసేవలు, ఇంటింటి జ్వరాల సర్వే తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మాలలకు అన్యాయం



శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

కూసుమంచి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరీలో మాలలకు అన్యాయం జరిగిందని కూసుమంచి గ్రామానికి చెందిన మాల సామాజికవర్గానికి చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జ్ భీంరెడ్డి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామానికి 60 ఇళ్లు మంజూరు అయితే మాలలకు కేవలం ఐదుమాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకులంలో అనేకమంది నిరుపేద అర్హులున్నారని, అయినా విస్మరించి అన్యాయం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందరికీ ఇళ్లు సమానంగా ఇస్తామని చెబుతున్నప్పటికీ స్థానికంగా కొందరు తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తు అన్యాయం చేస్తు ఇళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండోవిడతలో అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వాటర్ ట్యాంక్ కూల్చివేత

తిరుమలాయపాలెం, జూన్10(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం వాసులకు తాగునీరు అందించేందుకు సుమారు 20ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను మంగళవారం ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంపీవో సూర్యనారాయణ తొలిగించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సుమారు20 ఏళ్ల క్రితం వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. ఈ ట్యాంక్ శిథిలావస్థలో ఉండడంతో గ్రామస్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో ట్యాంక్‌ను కూల్చివేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖలీల్, పంచాయతీ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కేతినేని హరీష్

ఖమ్మం మామిళ్లగూడెం, జూన్10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో మంగళవారం హిందూపురం ఎమ్మెల్యే సినీ నటుడు నందమూరి బాలకృష్ణ 65వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కేతినేని హరీష్, మాట్లాడారు. ఈసందర్భంగా అభిమానులు, టీడీపీ కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉపేందర్, చుండూరి రాజరాజేశ్వరి, ఎస్కే రమణ, ఓర్సు కృష్ణ, జయరాం, మీగడ రామారావు, అబ్దుల్ మజీద్, రావెళ్ళ అనంతరామయ్య, చింతనిప్పు నాగేశ్వరరావు, నాగండ్ల లక్ష్మణ్, కూచిపూడి జై తదితరులున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా టీఎన్జీవో



సభ్యత్వాలను అందిస్తున్న గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదెన శ్రీనివాస్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన 27 మం ది వసతి గృహ సంక్షేమ అధికారులకు టీఎన్జీవోస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా చేరిన వారిని అభినందించారు. అనంతరం టీఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కో టపాటి రుక్మారావు, కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, కోశాధికారి కే.తిరుపతిరావు, టీఎన్జీవోస్ ఈసీ మెంబర్ ఎన్.విజయ, జి.కరుణాకర్, బాలాజీ, బాలు పాల్గొన్నారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

నేలకొండపల్లి, జూన్10(ఆంధ్రజ్యోతి): కగార్ ఆపరేషన్ పేరుతో మావోయిస్టులను చంపటా న్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వామపక్షాల నా యకులు ప్రకటించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీ(ఎం), సీపీఐ, ఎంఎల్ మాస్ లైన్‌లు సంయుక్తంగా పీఎస్సార్ సెంటర్లో ధర్నా నిర్వహించాయి. అనంతరం నాయకులు కర్నా భానుప్రసాద్, పగిడికత్తుల నాగేశ్వరరావు, పగిడికత్తుల రామదాసులు మాట్లాడారు. కార్యక్రమంలో మారుతి కొండలరావు, యడ్ల తిరుపారావు, యలమద్ది లెనిన్, పెద్దిరాజు నర్సయ్య, మారిశెట్టి వెంకటేశ్వర్లు, కా శిబోయిన అయోధ్య, సామాల మల్లికార్జున్, పి.నాగేశ్వరరావు, కట్టెకోల వెంకన్న పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ అవగాహన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దార్థ యోగా విద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 19 వరకు నిర్వహించే యోగా క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ కోదండరావు, కృష్ణమూర్తి, వెంకన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఔత్సాహికులు

విద్యుత్ వినియోగదారులకు ఫిర్యాదు కష్టాలు

- బీఎస్ఎన్ఎల్ నుంచి ఎయిర్‌టెల్‌కు మారిన అధికారుల ఫోన్ నెంబర్లు
- పాత నెంబర్లతో ఫిర్యాదుదారుల కూస్తీ



ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు వారం రోజులుగా సెల్ ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలంటే పదే పదే ఫోన్‌లు చేసిన ఒక్కరి ఫోన్ కూడా రింగ్ కావటం లేదు. ఇతర సమాదానాలు రావటం లేదు. దీంతో విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజుల వరకు టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో బీఎస్ఎన్ఎల్ సిమ్‌ల నెంబర్లు ద్వారా ఎస్ఈ నుంచి క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఈఈ వరకు సీయూజీ ఫోన్ నెంబర్లు వినియోగించారు. ఐదేళ్లకు పైగా ఇదే నెంబర్లు ఉండటంతో వేలాది సంఖ్యలో వినియోగదారులు ఇదే నెంబర్లు తమ సెల్‌ఫోన్‌లో నమోదు చేసుకున్నారు. వారం రోజుల నుంచి బీఎస్ఎన్ఎల్ సిమ్‌ల స్థానంలో ఎయిర్‌టెల్ నెంబర్లు మార్పులు జరుగుతున్నాయి. అయితే ఈ విషయాన్ని జిల్లా స్థాయి నుంచి విద్యుత్ ఉపకేంద్రాల స్థాయి వరకు విద్యుత్ వినియోగదారులకు అధికారులు బహిర్గతపర్చలేక పోయారు. దీంతో వారం రోజులుగా పాత నెంబర్లకు విద్యుత్ వినియోగదారులు ఫోన్‌లు చేస్తూ విసుగు చెందారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు తమ కొత్త నెంబర్లు వినియోగదారులకు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు మధిరలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



మధిరటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బుధవారం మధిర పట్టణంలో పర్యటించనున్నారు. 1983లో నిర్మించిన మధిర బస్టాండ్ పాక్షికంగా దెబ్బతినడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో డిప్యూటీ సీఎంగా భట్టి పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే బస్టాండ్ పునర్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో 8.5 కోట్లతో చేపట్టనున్న మధిర బస్టాండ్ ఆధునీకరణ పనులకు ఆయన రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు.

సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

▸ డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం



వైరా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీపీఎం వైరా డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు జూన్13 నుంచి 15వరకు కామేపల్లి మండలం కొత్తలింగాల క్రాస్ రోడ్ వద్ద ధన లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం తెలిపారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిలు, మండల కమిటి సభ్యులు, అందురూ హాజరుకావాలన్నారు. పార్టీ నాయకత్వానికి సైద్ధాతిక రాజకీయ అవగాహన, ప్రజా సమస్యలపై భవిష్యత్ పోరాటాల నాయకత్వం వహించే విధంగా ఈ రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. శిక్షణ తరగతుల బోధించడానికి పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం హాజరవుతున్నట్లు వీరభద్రం తెలిపారు. ఎంపికైన ప్రతినిధులు అందరూ మూడు రోజుల పాటు జరిగే రాజకీయ శిక్షణ తరగతులలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన మంగళవారం కోరారు.

పంచాయతీ కార్యదర్శి మృతి పట్ల సంతాపం



ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శికి నివాళులర్పిస్తున్న అధికారులు

పెనుబల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రారావుబంజర్ గ్రామ పంచాయతి కార్యదర్శి బాణోతు సోనాలి అకాల మృతికి చింతిస్తూ పంచాయతి రాజ్ ఉద్యోగులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం పెనుబల్లి మండల పరిషత్ కార్యాలయములో ఏర్పాటుచేసిన సంతాప సభలో సోనాలి చిత్రపటానికి యంపీడీవో అన్నపూర్ణ, యంపీవో ఉపేంద్రయ్య పూలమాలలు వేసి మౌనం పాటించి ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో యంపీడీవో కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూ భారతి

▸ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి
▸ లైసెన్స్‌డ్ సర్వేయర్ ద్వారా సమస్యల పరిష్కారం వేగవంతం

పెనుబల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, దీని ద్వారా రైతుల భూ సమస్యలన్ని పరిష్కారం అవుతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మండాలపాడులో జరిగిన భూ భారతి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రెవెన్యూ గ్రామ సభకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టాన్ని మేధావులు ప్రజా ప్రతినిధులు, రైతుల సలహాలకు అనుగుణంగానే తయారు చేశారని, ఈ చట్టం ద్వారా రైతుల అనేక సమస్యలు తహశీల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్ ద్వారా ఆరు నెలలలోపు పరిష్కారం అవుతాయని, గత ధరణి చట్టంలో ఉన్న లోసుగులను సవరిస్తూ ఈ భూ భారతి చట్టంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖా మంత్రి శ్రీనివాసరెడ్డి, మంత్రివర్గ సబ్ కమిటీ, కలెక్టర్లు, అనుభవజ్ఞుల సలహాల, సూచనల మేరకు ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించిందని, దీనిని సద్వినియోగం చేసుకుని రైతుల తమకున్న సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో కల్లూరు ఆర్‌డిఓ రాజేంద్ర గౌడ్ మాట్లాడుతూ.. భూ భారతి 2025 చట్టాన్ని గురించి రైతులకు వివరించారు. ఈ సదస్సులో పెనుబల్లి తహశీల్దార్ నారాయణమూర్తి, ఆర్ఐ విజయభాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వర రావు పలుశాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చింతకాని, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నూతన చట్టం భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం మండల



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పరిధిలోని వందనం గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సదస్సులో నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి పలు సమస్యలపై వచ్చే దరఖాస్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా కేసులను హైకోర్టు నుంచి అనుమతి వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం అర్హులకు పట్టాలు అందిస్తామన్నారు. ఆర్‌ఎస్ఆర్ సమస్యలను విస్తీర్ణం ఉంటే సర్వే చేసి పరిష్కరించాల్సి ఉంటుందని, ప్రతి భూ సమస్యకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని దరఖాస్తుదారులకు భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. అసైన్‌మెంట్ భూములను పేదలు కొనుగోలు చేస్తే పట్టా జారిచేస్తామని, లేని పక్షంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. ప్రభుత్వం త్వరలో అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి పేదలకు భూముల పంపిణీకి సిద్ధపడుతోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కూరపాటి అనంత రాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాస రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలకు సులభ పరిష్కారం: ఆర్డీవో



తల్లాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కల్లూరు ఆర్డీవో రాజేంద్ర గౌడ్ అన్నారు. మంగళవారం తల్లాడ మండలం రామానుజవరంలో జరిగిన భూ భారతి గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని 4,5,7 సెక్షన్ల గురించి వివరించారు. వీటి ద్వారా అనేక భూ సమస్యలకు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.సురేష్‌కుమార్, ఎంఆర్ఐ ఖాజామోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధునిక విద్య

కల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నవీకరించిన పూర్వ ప్రాథమిక విద్యా సిలబస్‌తో అంగన్వాడి కేంద్రాల్లో విద్యాబోధన జరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సిహెచ్ నిర్మల జ్యోతి అన్నారు. మంగళవారం కల్లూరులో అమ్మమాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు పట్టణంలోని పలు అంగన్వాడి కేంద్రాల్లో సూపర్వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో కేంద్రాల్లో మామిడి తోరణాలతో రంగరంగులు బెలూన్స్‌తో ఆకర్షణీయంగా అలంకరించారు. కేంద్రాల పరిధిలో గల తల్లిదండ్రులు, చిన్నారుల, ప్రముఖుల సమక్షంలో పండుగ వాతవరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ.. 30 నెలలు నిండిన పిల్లలందరిని అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదం



కల్లూరులో అమ్మమాట అంగన్‌వాడీ బాట ప్రదర్శన

డ్రులను కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పద్ధతిలో విద్యాబోధన నిర్వహించడానికి శ్రీకారం చుట్టామన్నారు. పిల్లలకు విద్యాబోధన అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యమంలో ఏసిడిపిఓ రత్నమ్మ, సూపర్వైజర్ సంధ్యారాణి. అంగన్వాడీ టీచర్ సఫీయా బేగం ఆయా లీల , తల్లులు పాల్గొన్నారు.

వైరాలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

▸ టీపీపీసీ ప్రధాన కార్యదర్శిగా కట్ల రంగారావు నియామకం పట్ల హర్షం
▸ బాణసంచా కాల్చి స్వీట్లు పంచిన కార్యకర్తలు

వైరా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాంగ్రెస్ కమిటి ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ల రంగారావును అధిష్టానం నియమించడం పట్ల వైరాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంబరాలను ఘనంగా నిర్వహించారు. వైరాలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు కుల సంఘాలు ఘనంగా సన్మానించి కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంపిణీచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ కార్యాలయలం, స్థానిక క్రాస్‌రోడ్డులో బాణసంచాకాల్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కట్ల రంగారావు విద్యార్థిదశ నుంచి ప్రస్తుత పీపీసీ ప్రధాన కార్యదర్శి వరకు 35 సంవత్సారాల పాటు ఎన్నో పదవులు నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషిచేశారన్నారు. వైరాలో పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి తీసుకరావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సి



రంగారావును సన్మానిస్తున్న వైరా కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాల్ మాజీ ఛైర్మన్ సూతగాని జైపాల్,పార్టీ నాయకులు రేచర్ల నాగేశ్వరరావు,సయ్యద్ అన్వర్,రేచర్ల పుల్లయ్య, ధార్నా రాజశేఖర్, పనితీ సైదులు, పనితి శ్రీను, గుత్తికొండ వీరబాబు,వీరంశెట్టి సీతారాములు, రేచర్ల సత్యం జాలాది రామకృష్ణ, తేజావత్ రామకృష్ణ, ముదిగొండ మహేష్, మోల దుర్గాప్రసాద్, గుడిమళ్ల రత్తయ్య, ఐలారి మోహన్‌రెడ్డి, యామాల భాస్కర్, విశ్వనాధం, కంభంపాటి సత్యనారాయణ, షేక్ రహీం,కట్ల,నాగరాజు, సంతోష్, షేక్ మోసిన్ శీలం ప్రభాకర్‌రావు, నరసింహారావు, కురిసేటి వెంకటేశ్వర్లు, తాండ్ర సైదులు, గుత్తా నాగరాజు, అబ్బురి కాంతయ్య, అమర్లపుడి నవీన్, దగ్గుపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించలంటూ కార్యదర్శుల వినతి

పెనుబల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతి కార్యదర్శులు ఎంపీడీవో అన్నపూర్ణకు, ఎంపీవో ఉపేం ద్రయ్యలకు వినతి పత్రాలు అందజేసారు. తమ గ్రామ పంచాయతిల్లో నిధులు మంజూరు చేయకుండా పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, తాగునీరు సమస్యలను పరిష్కరించడం సాధ్యం కావడం లేదని, తమ శాఖ కార్యకలాపాలతోపాటు ఇతర శాఖలకు సంబంధించిన విధులను కూడా తమకు అప్పగించడం వల్ల తమకు పనిభారం పెరుగుతందని, ఇప్పటికే గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం తాము చేతినుండి డబ్బులు వెచ్చించాల్సి వస్తుందని, దీనితో తమకు ఆర్థిక సమస్యలుకూడా ఏర్పడుతున్నాయని వారు తమ వినత పత్రంలో పేర్కొన్నారు. 12వ తేదీలోపు తమ సమస్యలను పరిష్కరించనట్లైతే సామూహిక సమ్మెకు సిద్ధం అవుతామని గ్రామ పంచాయతి కార్యదర్శులు తెలిపారు. ఈ కార్య క్రమంలో అన్ని గ్రామ పంచాయతి కార్యదర్శులు పేర్కొన్నారు.



ఎంపీడీవో అన్నపూర్ణకు వినతి ప్రతం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ వేసవి క్రీడా శిక్షణ శిబిరం



ప్రోత్సాహక బహుమతులను అందుకున్న క్రీడాకారులు

▸ ఉత్సాహభరితంగా మెళకువలను నేర్చుకున్న క్రీడాకారులు

బోనకల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోయిన నెల 1వ తేది నుంచి ప్రారంభమైన బాల్ బ్యాడ్మింటన్ వేసవి క్రీడా శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఎంతో ఉత్సాహభరితంగా సాగిన శిక్షణలో క్రీడాకారులు కోచ్ అమరేసి లింగయ్య నుంచి మెళుకువలను నేర్చుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా బోనకల్‌లో గ్రామీణ క్రీడగా పేరున్న బాల్ బ్యాడ్మింటన్‌కు వేసవిలో క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో బోనకల్‌కు చెందిన క్రీడాకారులు వరుస విజయాలను సాధిస్తూ పతకాల మోత మోగిస్తున్నారు. ప్రతి ఏటా ఇస్తున్న వేసవి శిక్షణలో భాగంగా ఈ ఏడాది కూడ శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి మెడల్స్‌తో పాటు సర్టిఫికేట్లను కూడ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన క్రీడాకారులు మాట్లాడుతూ.. తమకు వేసవి శిక్షణ క్రీడా నైపుణ్యం పెంచుకోవడానికి ఎంతగానో దోహదపడిందని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కోచ్ లింగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ సీనియర్ నాయకుని మృతి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

చింతకాని, జూన్ 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడు మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామ టీడీపీ కార్యదర్శి షేక్ భాషా మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. మృతదేహాన్ని మండల నాయకులు సందర్శించి టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షడు తేలుకుంట్ల శ్రీనివాసరావు, దారగాని రామారావు, కూచిపూడి సుధాకర్, మల్లెల సత్యనారాయణ, కేతబోయిన సురేష్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల టీబీ

తల్లాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల టీబీ వ్యాధి వస్తుందని తల్లాడ మండల వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ అన్నారు. మంగళవారం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే నివాసంలో ఎక్కువమంది ఉండడం వల్ల, సరైనా పౌష్టికాహారం తీసుకోకుండా ఉడేవారిలో టీబీ వ్యాధి వస్తుందన్నారు. ఆర్‌బీఎస్‌కే డాక్టర్ శ్రీనివాసరావు, సీహెచ్‌వో భాస్కర్, హెల్త్‌సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, సురేష్, సంజయ్, కళావతిపాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిషోర్

మధిరటౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సులతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు. అనారోగ్యాంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మధిర పట్టణం, రూరల్ గ్రామాలకు చెందిన 20 మందికి రూ.8.49 లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిడమానూరి వంశీ, చావా వేణు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, జహంగీర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం ఆస్పత్రి కార్మికుల ఆందోళన

కల్లూరు, జూన్10 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ఏరియా ఆస్పత్రి పరిధిలో పనిచేస్తున్న కార్మికులు పెండింగ్ వేతనాల కోసం మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి పెండింగ్ వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ.. అసలే చాలి చాలని వేతనాలతో అవస్థలు పడుతున్న కార్మికులకు ప్రతి నెల వేత నాలు సక్రమంగా అందక పోవడంతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రతి నెల 5వ తేది లోగా వేతనాలు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల వేతనాలు అందించే వరకు ప్రతి రోజు కార్మికులు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అనంతరం వేతనాల




కల్లూరులో ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న సీహెచ్‌సీ కార్మికులు

అందించే విషయంలో కార్మికులు సిహెసిలో అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు దామాల దయాకర్, ఆసుపత్రి కార్మికులు వంశీ, ప్రసాద్, కృష్ణ, నాగమణి, రమాదేవి పాల్గొన్నారు.

దోపిడీ వ్యవస్థను వ్యతిరేకించడమే కమ్యూనిస్టుల ధ్యేయం

బోనకల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం రాజకీయ విద్యా విభాగం సభ్యుడు బండారు రమేష్ తెలిపారు. మండలంలోని చిరునోముల పరిధిలో గల ఎస్ ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగిన సీపీఎం డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులతో భాగంగా ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు సిద్ధాంతం పట్ల అవగాహన కల్పించేందుకు గానూ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. పెట్టుబడి దారుల సమాజంలో శ్రమకు, కష్టజీవులకు విలువ ఉండదన్నారు. పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర, మండల



సమావేశంలో మాట్లాడుతున్న బండారు రమేష్

నాయకులు పోలేపల్లి సోమయ్య, డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, పాపినేని రాంనర్సయ్య, మందా సైదులు, పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

'విజయ'లో ఘనంగా ఫేర్వెల్ డే

ఫేర్వెల్ డేలో విద్యార్థులకు కలిసొచ్చిన ప్లేస్‌మెంట్ డ్రైవ్

కొణిజర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్‌ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫేర్వెల్‌డే కార్యక్రమానికి ప్రముఖ కంపెనీ సీఈవోలు, పెట్టుబడిదారులు స్టూడెంట్‌ట్రైబ్‌కు చెందిన శ్రీచరణ్‌లక్కరాజు, లీడర్స్ ఫర్ ఇండియా ఆర్గనైజేషన్(ఎల్ఐవో)ఎర్ర మోహిన్ష్, షైకాప్ ఇన్వెస్టెమెంట్స్ డైరక్టర్ పారుపల్లి శ్రీకవిత హాజరయ్యారు. ముందుగా కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మీ, అతిథులతో కలిసి జ్యోతిప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఆటపాటలతో చూపరులను అలరించారు. ఫేర్వెల్ డేలో భాగంగానే శ్రీచరణ్‌లక్కరాజు విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. సమాదానం చెప్పిన ముగ్గురు విద్యార్థులకు వెంటనే ఇంటర్న్‌షిప్‌ను ఆఫర్ చేశారు. అనంతరం మోహిన్ష్ ఎర్ర మాట్లాడుతూ.. ఉద్యోగాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. విజయ



మాట్లాడుతున్న మోహిన్ష్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ పారుపల్లి ఉషా కిరణ్‌కుమార్, అతిథులు

విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ అయేషాతరుణం, డీన్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ ఫరీద్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ వైరా బాధ్యతలు ఆర్యవైశ్యులకే ఇవ్వాలి

వైరా జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వైరా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని ఆర్యవైశ్యులకే కేటాయించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్‌కు కల్వ సుజాత అభిమాన సంఘం రాష్ట్ర నాయకులు గ్రంధి ప్రమాణ కుమార్, మిట్టపల్లి నాగి, మిట్టపల్లి రాఘవరావు ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. వైరా పట్టణంలో గతంలో అధ్యక్ష పదవిని కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యులకే కేటాయిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్యవైశ్యులకే ఇవ్వాలన్నారు. నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ రావు, అనుమోలు భాస్కర్‌రావు, రాయల నాగేశ్వరరావు, తాటికొండ రాము, యూత్ కాంగ్రెస్ సభ్యులు జీవివి రవికుమార్, షైలవరం శ్రీనివాస్‌రావు, కొణతల రాజా, కొణతల శ్రీనివాస్, బండారి కృష్ణారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

ఘనంగా బాలకృష్ణ బర్త్‌డే



కేక్ కట్‌చేస్తున్న టీడీపీనాయకులు

తల్లాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, హిందుపురం ఎమ్మెల్యే, పద్మవిభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కూచిపుడి వెంకటేశ్వరరావు, దూపాటి భద్రరాజు, సరికొండ శ్రీనివాసరావు, కొమ్మినేని సత్యనారాయణ, మొక్క కృష్ణార్జున్, గొడ్ల వెంకటరత్నం, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో డబ్బులు అడిగేవారిని నమ్మొద్దు

కారేపల్లి జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తాం అని మాయ మాటాలు చెప్పేవారిని నమ్మి మోసపోద్దని ఎంపీడీవో సురేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. మోసపూరిత మాటాలు చెప్పి డబ్బులు వసూలు చేసేవారి మాటలు నమ్మి డబ్బులు ఇస్తే అది తమకు సంబంధం లేదన్నారు. పేదవారిని నమ్మించి డబ్బులు వసూలు చేయడం తప్పన్నారు.